# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 19 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 24 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :19 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 24 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో

## కొట్లాట..

**పోలీస్ స్టేషన్‌కు చేరిన సుమలత వర్సెస్ రఘు మాస్టర్ పంచాయితీ!**

పెన్ పవర్ డెస్క్:టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో అం తర్గత వర్గ విభేదాలు ఒక్కసారిగా తీవ్ర రూపం దాల్చాయి. హైదరాబాద్ లోని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫీస్ ప్రాంగణంలోనే ఇరు వర్గాల డ్యాన్సర్లు పరస్పరం ఘర్షణకు దిగడంతో ఉద్రిక్త

- మిగతా 2లో

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

**ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు**



- ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య
- ఈసీలో అవకతవకలపై వస్తున్న కథనాలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్య
- ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్

- మిగతా 2లో



## బీజేపీలో భారీ మార్పులు..

**28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు**

- ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్వింద్ భదౌరియా
- తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్
- ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి

- మిగతా 2లో

## అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మళ్లీ భారత్ కుబేరుడిగా గౌతమ్ అదానీ
- ముఖేశ్ అంబానీని వెనక్కి నెట్టి అగ్రస్థానం కైవసం
- వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026లో వెల్లడి
- జాబితాలో పెరిగిన మహిళా సంపన్నుల సంఖ్య
- ఏఐ, టెక్ రంగాల నుంచి కొత్త కుబేరుల వెల్లువ



పెన్ పవర్ డెస్క్:భారత సంపన్నుల జాబితాలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముఖేశ్ అంబానీని అధిగమించి, గౌతమ్ అదానీ మరోసారి దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. 'వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' ఈ వివరాలను వెల్లడించింది.ఈ నివేదిక ప్రకారం, గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం సంపద 13 శాతం వృద్ధితో రూ. 9.23 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో, ముఖేశ్ అంబానీ సంపద 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో అదానీ సుమారు రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో

- మిగతా 2లో



తిరుమలలో వైభవంగా

## చక్రస్నానం..

**ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు**

- శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు నేడు చక్రస్నానం
- పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు
- మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- 8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ
- సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు

- మిగతా 2లో

## ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష



- శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటనున్న వాయుగుండం
- ఉత్తరాంధ్ర జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల సూచన
- గంటకు 85 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం
- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మిగతా 2లో

## సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత

# యువతరానిదే

- అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా తీర్చిదిద్దుతాం
- ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు 12 ఎకరాలు కేటాయింపు
- రూ.60 వేల కోట్లతో రాజధానిలో రోడ్ల నిర్మాణం
- అమరావతిలో హెల్త్‌కేర్ హబ్, క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు
- ఏఐ, డేటా సెంటర్లు, డీప్‌టెక్ రంగాలకు ప్రాధాన్యం
- ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి
- సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో యువత ముందుండాలి



పెన్ పవర్ డెస్క్: ప్రపంచమంతా మెచ్చే నగరంగా అమరావతి మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఫౌండేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాజధానిలో నిర్మించే ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలని ఆకాంక్షించారు. ఈ ఇనిస్టిట్యూట్‌కి 12 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. "అమరావతికి అనేక ఉన్నత విద్యాసంస్థలు వచ్చాయి.. వస్తున్నాయి. రూ.60వేల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం. రాజధానికి స్పోర్ట్స్ సిటీ, విమానాశ్రయం వస్తాయి. అమరావతి హెల్త్ కేర్ హబ్‌గా మారుతుంది. క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్.. గేమ్ ఛేంజర్స్ అవుతాయి. ప్రపంచంలో ఆరు దేశాల్లోనే క్వాంటమ్ ఉంది.. అమరావతికీ వస్తుంది. 21 కంపెనీలు స్టార్టప్‌లతో ముందుకొచ్చాయి. ఏఐ, డేటా

- మిగతా 2లో

## రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు: చంద్రబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్ఈసీ ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఇన్‌ఛార్జ్ మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని వచ్చే బాధ్యతను ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రులకు ఎలక్షన్

- మిగతా 2లో



## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

## ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి
- మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**జగన్ పై మంత్రి ఫైర్**

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో

- మిగతా 2లో

## టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!



- టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 51 మందిపై రౌడీ షీట్లు
- వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెల్ల అప్పిరెడ్డి, నేత దేవినేని అవినాష్ పేర్లు
- 2021 అక్టోబర్‌లో జరిగిన ఘటనపై ప్రస్తుత ప్రభుత్వంలో సీఐడీ విచారణ
- ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో 9 పోలీస్ స్టేషన్లలో షీట్ల నమోదు
- చంద్రబాబు నివాసంపై దాడి కేసును కూడా సీఐడీకి అప్పగించిన ప్రభుత్వం

- మిగతా 2లో

## చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- విశాఖ వైసీపీ నేతలతో సమావేశమైన జగన్
- కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా భూములు పంచుకుంటున్నారని ఆరోపణ
- ప్రతి గ్రామంలో మంద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ ఈరోజు విశాఖపట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రాష్ట్రంలో రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీ పేరుతో 55 ఎకరాల భూమిని కేటాయించారంటే

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### న్యూక్లియర్ ఫ్యూజన్ లో భారత్ ముందడుగు

న్యూక్లియర్ ఫ్యూజన్ ఎనర్జీ రంగంలో భారత్ మరో మైలురాయిని అధిగమించింది. సూర్యుడి కేంద్రం కన్నా 20 రెట్ల వేడి ప్లాస్మాను సృష్టించారు. గుజరాత్‌లోని ప్లాస్మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐపీఆర్)కు చెందిన ఎస్ఎస్టీ-1 టోకామాక్‌పై కొత్త శక్తివంతమైన గైరో ట్రాన్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించారు. ఇది 82.6 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ, 400 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. టోకామాక్‌లోని అత్యంత వేడి ప్లాస్మాను మరింత వేడి చేయడానికి ఈ కొత్త పరికరం ఉపయోగపడుతుంది.స్టడీ స్టేట్ సూపర్‌కండక్టింగ్ టోకామాక్ అనే పరికరం, నియంత్రిత పద్ధతుల్లో సూర్యుడిపై జరిగే న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రక్రియను నిర్వహిస్తుంది. టోకామాక్‌లోని బలమైన అయస్కాంత క్షేత్రం ప్లాస్మాను నియంత్రిస్తుంది. తాజా పరిశోధనల్లో ప్లాస్మా ఉష్ణోగ్రత 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా చేరింది. ఇది సూర్యుడి కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న వేడి కన్నా దాదాపు 10-20 రెట్లు ఎక్కువ.గైరో ట్రాన్ అనేది అధిక ఫ్రీక్వెన్సీ మైక్రోవేవ్ శక్తిని ఉత్పత్తి చేసే ప్రత్యేక పరికరం. ఈ శక్తిని టోకామాక్‌లోని ప్లాస్మాలోకి పంపించడం ద్వారా దాని ఉష్ణోగ్రతను మరింత పెంచుతారు. ఎస్ఎస్టీ-1లో ఇంతకుముందు 42 గిగాహెర్ట్జ్ జైరోట్రాన్ వ్యవస్థను ఉపయోగించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్ వ్యవస్థ అధిక సామర్థ్యంతో ప్లాస్మాను వేడి చేయడానికి సహాయపడుతుంది.ఫ్యూజన్ ప్రక్రియలో ప్లాస్మాను అత్యంత వేడికి చేర్చడమే కాకుండా, దానిని తగిన సమయం పాటు స్థిరంగా ఉంచడం కూడా అత్యంత కీలకం. కొత్త గైరో ట్రాన్ ఈ ప్రయోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సైంటిస్టులకు ఉపయోగపడింది.ఫ్యూజన్ (కేంద్ర సంలీన చర్య) ముఖ్యంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో జరుగుతుంది. దీని వల్ల అపారమైన శక్తి వెలువడుతుంది. స్వచ్ఛమైన భారీ స్థాయిలో శక్తిని అందించగల సామర్థ్యం దీని సొంతం. ఇందులో హైడ్రోజన్ ఐసోటోపులను ఇంధనంగా ఉపయోగించే అవకాశం ఉంది. హైడ్రోజన్ ఐసోటోపులు ఢీకొని హీలియంగా మారి, భారీ శక్తి విడుదల అవుతుందిప్రస్తుతం సాంప్రదాయ అణు విద్యుత్ కేంద్రాల్లో జరిగే న్యూక్లియన్ ఫిజన్(కేంద్ర విచ్ఛిత్తి చర్య) వల్ల యురేనియం లేదా ప్లూటోనియం ఢీకొట్టుకోవడం వల్ల చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. దీని వల్ల శక్తి విడుదల అవుతుంది. ఫిషన్‌తో పోలిస్తే ఫ్యూజన్ చర్యలో దీర్ఘకాలికంగా నిల్వ చేయాల్సిన రేడియోధార్మిక వ్యర్థాల సమస్య తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. తక్కువ ఇంధనంతో భారీ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు.అణు రియాక్టర్లలో న్యూక్లియన్ ఫిషన్ చర్య ఒక విచ్ఛిత్తి మరో విచ్ఛిత్తికి దారి తీసే చైన్ రియాక్షన్ ఉంటుంది. ఫ్యూజన్‌లో ప్లాస్మా పరిస్థితులు కొనసాగకుంటే ఫ్యూజన్ చర్య వెంటనే స్వయంగా ఆగిపోతోంది. దీని వల్ల పెద్ద ప్రమాదాలు ఉదాహరణకు చెర్నోబిల్ వంటి ప్రమాదాలు ఉండవు. ఫ్యూజన్ చర్యలో విడుదలయ్యే హీలియం రేడియో యాక్టివ్ కాదు. అణు వ్యర్థాల సమస్యే ఉండదు.

## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

- మొదటి పేజీ తరువాయి

విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు .డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

**కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్**

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది. ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు**

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది.కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు.ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం**

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు.చిన్న రైతులకు భరోసా: భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది రాజధాని రైతులకు ఎంఎ ఊరటనిచ్చే నిర్ణయం.

**ఇతర ముఖ్యమైన నిర్ణయాలు**

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు.

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు.

న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు.

భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైత, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

# టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు సహా మొత్తం 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెళ్ల అప్పిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ వంటి ప్రముఖుల పేర్లు ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.వివరాల్లోకి వెళితే, 2021 అక్టోబర్ 19న గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ ఘటనపై తాజాగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలకు రౌడీ షీట్లు తెరవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఈ దాడి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో వైసీపీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్రలు, సుత్తులతో కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఆవరణలో నిలిపి ఉంచిన కార్లను కూడా ధ్వంసం చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు.

ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సహా మొత్తం 110 మందిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 147, 148, 323, 324, 326, 307, 380, 427, 459, 452, 506 రెడ్ విత్ 109, 120-బి, 149 కింద కేసు నమోదు చేసి

దర్యాప్తు చేపట్టారు.2024 జూన్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై మళ్లీ దృష్టి సారించింది.

2024 అక్టోబర్ లో ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో పాటు 2021 సెప్టెంబర్‌లో చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసును కూడా సీఐడీ విచారణకు బదిలీ చేసింది. తాజా పరిణామాలతో పాత కేసుల దర్యాప్తులో వేగం పుంజుకోవడం, వైసీపీ నేతలపై రౌడీ షీట్లు తెరవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు.

అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు.అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

**విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు. ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో కొట్లాట..

- మొదటి పేజీ తరువాయి

పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ 'మినిట్స్ బుక్' దక్కించుకునే క్రమంలో ప్రస్తుత అధ్యక్షురాలు, జానీ మాస్టర్ భార్య సుమలత, కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ గొడవ ముదిరి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. అసోసియేషన్ కు సంబంధం లేని వ్యక్తులు కుట్రతో తమపై దాడి చేశారని సుమలత ఆరోపించింది. సుమలత మనుషులే తమపై దాడి చేశారంటూ రఘు మాస్టర్ వర్గం పేర్కొంది. ఈ ఘటనపై ఇరువర్గాలు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సుమలత తీరుపై ఆగ్రహంతో ఉన్న కొందరు తోటి డ్యాన్సర్లు ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ గొడవకు కారణం.. అంతకుముందు తెలుగు ఫిలిం ఫెడరేషన్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయం.. డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న సమస్యలను తేల్చేందుకు ఫెడరేషన్ పెద్దలు సుమలత, రఘు మాస్టర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 225 మంది సినీ డ్యాన్సర్లు హాజరైన ఈ మీటింగ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా అభిప్రాయ సేకరణ జరిపారు.

ఈ ఓటింగ్‌లో ఏకంగా 214 మంది డ్యాన్సర్లు రఘు మాస్టర్‌కే మద్దతు తెలపగా.. సుమలత వైపు కేవలం 11 మంది మాత్రమే నిలిచారు.

దీంతో మెజారిటీ నిర్ణయం మేరకు సుమలత నేతృత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ప్రకటించింది. అంతేకాకుండా, అక్టోబర్ 11న అసోసియేషన్ నూతన ఎన్నికలు నిర్వహిస్తామని షెడ్యూల్ విడుదల చేసింది.

ఫెడరేషన్ తీసుకున్న ఈ ఊహించని షాకింగ్ నిర్ణయం, ఎన్నికల షెడ్యూల్‌తో డ్యాన్సర్ల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఏకంగా ఫిల్మ్ ఛాంబర్‌లోనే దాడికి పాల్పడేంతగా వివాదం చెలరేగడంతో అక్టోబర్ 11న జరగబోయే ఎన్నికలు ఇంకెన్ని మలుపులు తిరుగుతాయోనని ఇండస్ట్రీ వర్గాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి.

## బీజేపీలో భారీ మార్పులు..

రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు. తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

**తమిళనాడు:** రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురానా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ

ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

## రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

టార్గెట్ నుంచి లా అండ్ ఆర్డర్ వరకు అన్ని అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై రైల్వే యాక్ట్ తరహాలో కఠిన చట్టం తీసుకురావాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయకుల ముసుగులో అసాంఘిక శక్తులు విధ్వంసానికి పాల్పడుతున్నాయని, వైకాపా రౌడీ మూకలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. జగన్ బెంగళూరులో కూర్చుని రౌడీ గ్యాంగ్ ద్వారా ఏపీలో అరాచకాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్‌ను దెబ్బతీసే ఎలాంటి ప్రయత్నాన్నీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడి ఘటన.. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడిన తీరు బట్టబయలైందని చంద్రబాబు అన్నారు. శాప్ కార్యాలయం, టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌పై జరిగిన దాడుల్లో ఒకే వ్యక్తులు ఉన్నారన్న అంశాన్ని ప్రస్తావించారు. వైసీపీ నేతలు జరగని విషయాలను జరిగినట్లుగా ప్రచారం చేయడంలో సిద్ధహస్తులని ఆరోపిస్తూ, ఉద్దేశపూర్వకంగా బురద చల్లే ప్రయత్నాలను తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

## సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే

- మొదటి పేజీ తరువాయి

సెంటర్, క్వాంటమ్, డీప్ టెక్నాలజీ వస్తున్నాయి. కర్నూలులో అన్ని రకాల డ్రోన్లు తయారు చేస్తున్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భవిష్యత్తు అంతా ఇన్నోవేషన్స్ రంగానిదే. ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి. సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే" అని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.ఇది తీరం దాటే సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

## అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మొదటి పేజీ తరువాయి

అంబానీని వెనక్కి నెట్టారు. ఈ జాబితాలో ఆర్సెలర్‌మిట్టల్ యజమాని ఎల్.ఎన్. మిట్టల్ కుటుంబం 93 శాతం వృద్ధితో, రూ. 3.39 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచింది.ఈ ఏడాది జాబితాలో మహిళా సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. కొత్తగా 131 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మహిళల విభాగంలో రూ. 2.79 లక్షల కోట్ల సంపదతో రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానంలో నిలిచారు. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 391కి చేరింది. అత్యధిక సంపన్నులు ఉన్న నగరంగా ముంబై ప్రథమ స్థానంలో నిలవగా, బెంగళూరు, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.సాంకేతిక రంగం నుంచి కొత్త సంపన్నుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి చెందిన 19 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించగా, వారిలో 15 మంది కొత్తవారు కావడం విశేషం. క్వాంటం కంప్యూటింగ్ విభాగం నుంచి తొలిసారిగా బెంగళూరుకు చెందిన నాగేంద్ర నాగరాజ రూ. 1,700 కోట్ల సంపదతో ఈ జాబితాలో చేరారు.

### చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

ఈ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, అడ్డగోలుగా భూములను పంచుకుంటున్నారని మండిపడ్డారు.ప్రతి గ్రామంలో గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం దొరుకుతోందని, గుళ్లు, బడుల పక్కన కూడా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. విశాఖ మేయర్, కార్పొరేషన్‌ను ప్రభుత్వం హైజాక్ చేసిన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అన్నివేళలా అండగా ఉంటుందని, విశాఖలోని తాగునీటి సమస్యలు, భూముల అక్రమాలపై ప్రజల్లో పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, 2019 నంద్యాల ఉపఎన్నిక నుంచి పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాత్కాలిక అధికారంతో విర్రవీగినా... శాశ్వతంగా నిలిచేది ప్రజాస్వామ్యమేనని, ప్రజల తీర్పు నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు.

# తుఫాను ప్రభావంతో పాఠశాల ఆవరణలో కూలిన భారీ చెట్టు



**పద్మనాభం, సెప్టెంబర్ 23 (పెన్ పవర్):**అర్ణబ్ తుఫాను ప్రభావంతో పద్మనాభం మండలం చిన్నాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో బుధవారం ఉదయం 7 గంటల సమయంలో భారీ చెట్టు కూలిపోయింది.చెట్టు కూలిన విషయాన్ని గుర్తించిన పంచాయతీ కార్యదర్శి ఎన్. నరసింహమూర్తి వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అనంతరం సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో చెట్టు కొమ్మలు, విరిగిన శకలాలను యుద్ధప్రాతిపదికన తొలగించారు.పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తుఫాను సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి సమస్యను వెంటనే పరిష్కరించిన పంచాయతీ కార్యదర్శి నరసింహమూర్తిని గ్రామస్తులు అభినందించారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# తుపాను పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి
- కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిషాంతి.టి

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**వాయుగుండం ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు, అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నిషాంతి.టి సూచించారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌కు వస్తున్న ఫోన్ కాల్స్, ప్రజల నుంచి అందుతున్న సమాచారం, చేపడుతున్న సహాయక చర్యల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.వాగులు, నదులు, గెడ్డలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా చెట్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ తీగలు తెగిపడటం, స్తంభాలు విరిగిపడటం వంటి ఘటనలు చోటుచేసుకుంటే ప్రజలు వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విరిగిన విద్యుత్ స్తంభాలు, తీగలపై పడిన చెట్లను తొలగించేందుకు అవసరమైన సిబ్బంది, బలగాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా అన్ని గ్రామాల్లోని నీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేపట్టాలని పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాల అనంతరం వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. వాయుగుండం తీవ్రత, వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు, సమాచారాన్ని చేరవేయాలని అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్లలో రాకపోకలకు అంతరాయం కలగకుండా కూలిపోయిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. విపత్తు సహాయక బృందాలను అవసరమైన ప్రాంతాలకు తక్షణమే తరలించే విధంగా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ప్రజలు వాగులు, గెడ్డలు, కల్వర్టులు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలు, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగల సమీపంలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ల్యాండ్‌లైన్ నంబర్ 08935-293448కు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ నిషాంతి.టి కోరారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తిరుమాణి శ్రీ పూజ, జిల్లా ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, పాడేరు ఆర్డీఓ ఎం. భుజంగరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్ అలర్ట్.. నేడు పాఠశాలలకు సెలవు



రెసిడెన్షియల్ పాఠశాలలకు మినహాయింపు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**అల్లూరి సీతారామరాజు జిల్లాకు రెడ్ అలర్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు సెప్టెంబర్ 24న సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు.ప్రస్తుత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.రెసిడెన్షియల్ పాఠశాలలకు ఈ సెలవు వర్తించదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా పాఠశాలల్లో ఇప్పటికే ఉంటున్న విద్యార్థుల భద్రత, పర్యవేక్షణ, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు పాఠశాల ప్రాంగణం వెలుపలకు వెళ్లకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, పర్యవేక్షణ, సంక్షేమానికి సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)లను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో విద్యార్థుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

# జనసేనకు 13వ వార్డుపై ఎందుకింత "ప్రేమ"




## సీటు కోసం 13వ వార్డు కూటమిలో కుంపటి - ప్రజాప్రతినిధుల మధ్య కోల్డ్ వార్ ఎవరికోసం ?

**విశాఖ తూర్పు, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** ఎన్నికలు ఏవైనా రాజకీయంగా తూర్పు నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఎన్నికల ఆఖరి నిమిషం వరకు ఉత్కంఠ నెలకొంటుంది. 2026 స్థానిక ఎన్నికలలో కార్పొరేటర్ తో పాటు మేయర్ అభ్యర్థిని ప్రజలే నేరుగా ఎన్నుకోవడం ఈ ఎన్నికల ప్రత్యేకత. ఇది ఇలా ఉండగా 13వ వార్డు కూటమి ఐక్యత నామమాత్రమే.ప్రధానంగా టీడీపీ అభ్యర్థిగా పోటీ పడుతున్న వారికి ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. శాసనసభ్యులపై వారికి ఉన్న నమ్మకం, వారు ఇచ్చిన హామీ భరోసా ఎంతవరకు నిలబెట్టుకుంటారన్నది ప్రశ్నార్థకం. ఆయన ఇచ్చిన భరోసా, నమ్మకం చాలా విలువైనది.

**టీడీపీలో ముగ్గురు - మూడు వాదనలు:**

హామీ నిలబెట్టుకుంటారా? - టీడీపీకి అత్యవసర సమయంలో వేరే పార్టీని వీడి టీడీపీలో చేరిన తనకు ఇచ్చిన హామీని పార్టీ నిలబెట్టుకుంటుందా అనేది ఒకరి ప్రశ్న. పార్టీ అవసరాలకు ఉపయోగించుకుని "నేనున్నానంటూ" భరోసా ఇచ్చారని ఆయన వర్గం చెబుతోంది.ఆఖరి అవకాశం ఇవ్వండి - గత ఎన్నికలలో టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలై ఆర్థికంగా నష్టపోయి, వయోభారంతో సీటు కేటాయింపు కోసం ఆఖరి అవకాశంగా తనను అభ్యర్థిగా ప్రకటించాలని మరొకరు కోరుతున్నారు. తనకే టికెట్ ఇస్తారన్న భరోసాతో ఉన్నానని ఇది ఆఖరి అవకాశంగా భావించి పార్టీని అభ్యర్థిస్తున్నారు. 3. వ్యయ ప్రయాసలకు ఓర్చుకున్నా - "నాపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలను అప్పుజెప్పి, నాయకులను కార్యకర్తలను ఒక తాటిపైకి తీసుకొచ్చి, పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ అవసరాలలో అత్యధిక భాగం తానే నిలిచాను. వార్డు ప్రజల అవసరాల కోసం, పండుగలు, వార్షికోత్సవాలు, పార్టీ కార్యక్రమాలు, అన్నదానాలకు, పార్టీ పటిష్టతకు వ్యయ ప్రయాసలకు ఓర్చుకుని నిలబడ్డాను. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారన్న నమ్మకం నాది" అనేది మూడో నేత వాదన.

**జనసేన లాబీయింగ్ తీవ్రం:**

జనసేన టికెట్ తనకేనంటూ అధిష్టానం తన పేరును దాదాపు ఖరారు చేసినట్లు వార్డులో కొందరి నాయకులను కూడగట్టే పనిలో జనసేన తన పావులను కదుపుతోంది. 'వడ్డించేవాడు మనవాడైతే కడన ఉన్నా' అనే సామెతకు ఇది వర్తిస్తుంది. బల నిరూపణకు జన సమీకరణ చేయాలంటూ కొంతమంది నాయకులను కూడగట్టడంతో కథ అడ్డం తిరిగింది.పార్టీ మొదటి నుండి కష్టపడి జెండాలు మోసి జనసేన పార్టీని వార్డుకు పరిచయం చేసి కార్పొరేటర్ గా పోటీ చేసిన అభ్యర్థిని కాదని తనకు నచ్చిన వారికి టికెట్ కేటాయిస్తారన్న ప్రచారాన్ని శాసనసభ్యులు ఖండించకపోవడం వార్డులో చర్చనీయాంశం అయింది.క్లైమాక్స్: టీడీపీ, జనసేన శాసనసభ్యుల మధ్య ఈ ముగ్గురిలో ఎవరికి అన్యాయం జరిగినా భారీ మూల్యం చెల్లించక తప్పదనేది ప్రజలు చర్చించుకుంటున్న అంశం. వార్డులో టికెట్ల కేటాయింపులో అన్యాయం జరిగినా అధికార పార్టీకి భారీ మూల్యం తప్పదనేది వార్డు ప్రజలు ఎరిగిన సత్యం.

# "ప్లాస్టిక్" వినియోగం భావితరాలకు "ముప్పు"...!






- ప్లాస్టిక్ తయారీ కర్మాగారాలను మూసివేయాలి
- బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపోయిన చకర్రావు (చిన్న)

**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 23 :**గిరిజన ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోవడం పర్యావరణానికి, వ్యవసాయ భూములకు తీవ్ర ముప్పుగా మారుతోందని కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడి బోయిన చక్కర్రావు (చిన్న )ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్లాస్టిక్ వినియోగన్ని అరికట్టేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా వారపు సంతలు, గ్రామీణ మార్కెట్లలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను విచ్చలవిడిగా వినియోగించి ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో సమస్య తీవ్ర రూపం దాల్చుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్తకుప్పలతో పాటు పొలాలు, కాలువలు, రహదారుల వెంట పేరుకుపోతున్నాయని,పశువులు ఆహారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తినడంతో వాటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని గ్రామీణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు . ప్లాస్టిక్ వ్యర్థాలు సులభంగా కుళ్లిపోకపోవడంతో అవి ఏళ్ల తరబడి భూమిలోనే ఉండిపోయే పరిస్థితి నెలకొంటోందని, పొలాల్లో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల భూమి సహజ స్వభావం దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. వర్షపు నీరు భూమిలోకి సక్రమంగా ఇంకే ప్రక్రియకు ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డంకిగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో వ్యవసాయ భూములపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని, తక్షణమే సంబంధిత అధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగంపై పర్యవేక్షణ, నియంత్రణ చర్యలు తగిన స్థాయిలో లేవన్న విమర్శలు ప్రజల్లో వినిపిస్తున్నాయన్నారు. వారపు సంతల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత సంచులను ప్రోత్సహించాలని ప్రజలు కోరుతున్నారన్నారు.

ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్లాస్టిక్ ఉత్పత్త, విక్రియలుపై కఠినమైన నియంత్రణలు అమలు చేయాలని, ప్లాస్టిక్ తయారీ కర్మాగారాలను మూసివేయాలని, నిబంధనలు ఉల్లంగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఇప్పటినుంచే చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తు తరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపోయిన చక్కర రావు హెచ్చరించారు.

# తుఫాను నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..!

**మండల అభివృద్ధి అధికారి "జెడివి ప్రసాద్ రావు" వెల్లడి**

**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 23:** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మండల అభివృద్ధి అధికారి జెడివి ప్రసాద్ రావు సూచించారు. బుధవారం మండలంలో మంప పంచాయతీలో తమ సిబ్బందితో పర్యటించారు. తాటాకు ఇండ్లలో నివసించే వారికి పలు సూచనలు చేశారు అనంతరం ఎంపీడీవో ప్రసాద్ రావు మాట్లాడుతూ తుఫాను కారణంగా మన్య ప్రాంతంలో అత్యధికంగా వర్షాలు నమోదు అవుతున్న నేపథ్యంలో ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకొని సురక్షితమైన ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. మట్టి గోడలు ఉన్న ప్రాంతాలు ఎత్తైన చెట్ల వద్ద ఎవరు ఉండరాదని తెలిపారు. రెవిన్యూ పోలీస్ శాఖల అధికారులు కూడా నిత్యం ఈ తుఫాను ప్రభావం గురించి ప్రజలను మరింత అప్రమత్తం చేస్తున్నారని వివరించారు. తుఫాను కారణంగా ఏదైనా సమస్య ఏర్పడినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు



## తునిపాలెం కల్వర్టును పరిశీలించిన అధికారులు



**పద్మనాభం, సెప్టెంబర్ 23 (పెన్ పవర్):** పద్మనాభం మండలంలోని తునిపాలెం కల్వర్టును మండల ప్రత్యేక అధికారి శ్రీ జ్ఞానవేణి, తహసీల్దార్ దాడిశెట్టి శైలజ, ఎంపీడీవో బి. చిన్నారావు, సీఐ ఎం. చంద్రమౌళి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి. శ్యామల తదితర అధికారులు బుధవారం సందర్శించి పరిశీలించారు. కల్వర్టు వద్ద నెలకొన్న పరిస్థితులను పరిశీలించిన అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పాంద్రంగి గ్రామాన్ని కూడా సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఆర్ వి నగర్ అటవీ రేంజ్ అధికారి మణికృష్ణ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గూడెంకొత్తవీధి మండలంలోని ఆర్.వి. నగర్ అటవీ రేంజ్ పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్.వి. నగర్ అటవీ రేంజ్ అధికారి మణికృష్ణ సూచించారు.దుచ్చరపాలెం గ్రామం నుంచి సప్పర్ల రైన్ గేజ్ వరకు, గూడెం గ్రామం నుంచి మండపల్లి గ్రామం వరకు ఉన్న రిజర్వు అటవీ ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా చెట్లు విరిగి పడే అవకాశం ఉన్నందున అటవీ రహదారుల్లో, చెట్ల సమీపంలో అనవసరంగా నిలవకూడదని సూచించారు.ఎక్కడైనా చెట్టు విరిగి రోడ్డుపై పడటం, రాకపోకలకు అంతరాయం కలగడం లేదా ప్రమాదకర పరిస్థితిలో చెట్లు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. అలాగే కొండచరియలు విరిగిపడే ప్రాంతాలు, పొంగిపొర్లే వాగులు, కల్వర్టులు, ఇతర ప్రమాదకర ప్రాంతాల వద్ద ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.వర్షాల పరిస్థితుల దృష్ట్యా సంబంధిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని రేంజ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు అటవీ రేంజ్ అధికారి మణికృష్ణ తెలిపారు.

# వర్షం వస్తే రోడ్డా.. చెరువా?

- గత్తర గూడ--గత్తర జిలేడ రహదారి దుస్థితిపై సుజాత సల్మాన్ ఆగ్రహం



**డుంబ్రిగుడ/అరకులోయ పెన్ పవర్ సెప్టెంబర్ 23:** కొర్రెయి పంచాయతీ పరిధిలోని గత్తర గూడ--గత్తర జిలేడ రహదారి దుస్థితిపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారీ రహదారి బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.గ్రామస్థులతో కలిసి నిరసన చేపట్టిన సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ మాట్లాడుతూ.. "వర్షం వస్తే రహదారి చెరువుగా మారుతోంది. అత్యవసర సమయంలో గర్భిణీలు, వృద్ధులు, రోగులు ఆసుపత్రికి ఎలా వెళ్లాలి?" అని ప్రశ్నించారు.ప్రజల సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే పరిష్కరించాలని, రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని ఆమె డిమాండ్ చేశారు. హామీలు కాకుండా రహదారిపై పనులు కనిపించాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజల తరపున పోరాడుతామని సుజాత సల్మాన్ స్పష్టం చేశారు.

## భారీ వర్షాలకు లంకపాకలలో గిరిజన మహిళ ఇల్లు నేలమట్టం - బాధితురాలు నాదుకోవాలని విజ్ఞప్తి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** భారీ వర్షాలకు తోడు ఈదురుగాలులు వీస్తుండటంతో గూడెంకొత్తవీధి మండలం లంకపాకలు గ్రామంలో ఓ గిరిజన మహిళకు చెందిన ఇల్లు బుధవారం మధ్యాహ్నం కూలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లంకపాకలు గ్రామానికి చెందిన జర్త గంగాభవాని అనే మహిళకు చెందిన ఇల్లు భారీ వర్షాలకు బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.ఇల్లు కూలిపోవడంతో గంగాభవాని కుటుంబానికి ఆర్థికంగా నష్టం వాటిల్లింది. నిరుపేద గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇల్లు కోల్పోయిన బాధితురాలికి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని ఆమె కోరారు. అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వీఐటీ ఆధ్వర్యంలో పీఎం శ్రీ పాఠశాలల్లో డైస్ కార్యక్రమం



**కూర్మన్నపాలెం: పెన్ పవర్, సెప్టెంబర్ 23:** విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అటానమస్ ఆధ్వర్యంలో డెవలపింగ్ ఇన్నోవేషన్ కల్చర్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా డెవలపింగ్ ఎంటర్‌ప్రెన్యూరియల్ స్కిల్స్ -- కన్వర్టింగ్ ప్రాబ్లమ్స్ ఇంటూ సొల్యూషన్స్ అనే తొలి కార్యకలాపాన్ని సెప్టెంబర్ 22న విశాఖపట్నంలోని మూడు పీఎం కేంద్రీయ విద్యాలయ పాఠశాలల్లో నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల్లో ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు ఔత్సాహిక ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఎస్ఐసీ వ్యవస్థలో భాగంగా విద్యార్థులకు క్రమబద్ధమైన మార్గదర్శకత్వం, ఆచరణాత్మక అవగాహన కల్పిస్తున్నారు. డైస్ కార్యక్రమంలో ఔత్సాహిక నైపుణ్యాల అభివృద్ధి, ఫీల్డ్ విజిట్ అండ్ ఐడియా క్రియేషన్, ప్రోటోటైప్ ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ పీఓసీ అభివృద్ధి, స్టార్టప్ అండ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఐపీఆర్ అవగాహన, జిల్లా స్థాయి డెమో డే ఎగ్జిబిషన్ వంటి కార్యకలాపాలను నిర్వహించనున్నారు.కేంద్రీయ విద్యాలయం, మల్కాపురంలో కార్యక్రమాన్ని డా. ఏ. సంపత్ దక్షిణామూర్తి, హెడ్, వీసీఐఎస్ మరియు సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్, ఈసీఈ; కేంద్రీయ విద్యాలయం నెం.1, నౌసెనాబాగ్లో డా. ఔధతి దత్తా, అసోసియేట్ ప్రొఫెసర్, ఎంబీఏ; కేంద్రీయ విద్యాలయం నెం.2, నౌసెనాబాగ్లో డా. బి. ఓంకార్ లక్ష్మీ జగన్, ఇన్‌చార్జ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ మరియు అసోసియేట్ ప్రొఫెసర్, సీఎస్ఈ, నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సమస్యలను గుర్తించడం, అవకాశాలను గుర్తించడం, సృజనాత్మకంగా ఆలోచించడం, ఆలోచనలను రూపొందించడం, పరిష్కారాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలను వినూత్న పరిష్కారాలుగా మార్చే దిశగా విద్యార్థులను ప్రోత్సహించారు. మూడు పాఠశాలలకు చెందిన 7, 8, 9 మరియు 12వ తరగతుల మొత్తం 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి కేవీ మల్కాపురం ప్రిన్సిపాల్ శ్రీ సత్యజీత్ మిశ్రా,కేవీ నెం.1 నౌసెనాబాగ్ ఎస్పీఓసీలుగా శ్రీమతి ఆకృతి దూబే, సుధీర్ కుమార్ మైంగి; కేవీ నెం.2, నౌసెనాబాగ్‌కు చెందిన వి. సత్యం నాయుడు, శ్రీ వంశీ కృష్ణ ఈ.వి.ఎల్.ఎన్. మరియు ఎస్పీఓసీ గుడి త్రివేణి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారం అందించారు. వీఐటీ ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్ విద్యార్థుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని అభినందిస్తూ, పాఠశాలల యాజమాన్యాలు, ఎస్పీఓసీలు, ఉపాధ్యాయులు మరియు మార్గదర్శకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం, విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార దృక్పథం, ఆవిష్కరణ మరియు భవిష్యత్ ఔత్సాహిక నైపుణ్యాలను పెంపొందించే దిశగా డైస్ కార్యక్రమాల శ్రేణికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.

## ధారకొండలో కమ్యూనిటీ భవనం, సులాబ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** గూడెంకొత్తవీధి మండలం ధారకొండలోని శ్రీశ్రీ దారాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నూతన కమ్యూనిటీ భవనం, సులాబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి బుధవారం జోరువానలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరకు ఎంపీ గుమ్మా తనూజారాణి నిధుల నుంచి కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.22 లక్షలు, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర నిధుల నుంచి సులాబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించినట్లు నిర్వాహకులు తెలిపారు. దారాలమ్మ తల్లి ఆలయానికి దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని నిధులు కేటాయించిన ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో దారాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ చైర్మన్ పోతురాజు గోవింద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మచ్చల మత్యరాజు, ఎంపీటీసీ సభ్యులు మడకం రామన్న, పోతురాజు కృష్ణమూర్తి, అంపురంగి బుజ్జిబాబు, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ దావీదు, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, మండల కార్యదర్శి దేవరాజు ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బోయిన వెంకట్, మడకం చిట్టిబాబు, పోతురాజు జగన్నాథం, కిల్లో సతీష్, రెడ్డి ఉదయ్, శెట్టి సత్తిబాబు, కొట్టెక్కి ప్రసాద్, గోపినాయక్ ప్రకాష్, పాస్టర్ రెడ్డి బాబురావు, శంఖం సత్తిబాబు, వెలుగురి సత్యనారాయణ, దట్ట రామారావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విపత్తులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గూడెంకొత్తవీధి మండల అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. విపత్తుల నివారణ, ముందస్తు సన్నద్ధత, అత్యవసర సమయంలో స్పందన, విపత్తు అనంతర చర్యలపై మండల స్థాయి అధికారులతో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు, జీకే వీధి ఎస్సై కే. సురేష్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మణికృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్‌రావు, వ్యవసాయ శాఖ మండల అధికారి ఎన్. సురేష్, పంచాయతీరాజ్ జేఈ కొయ్యం బాలు, ఇరిగేషన్ జేఈ నాగరాణి, గృహ నిర్మాణ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలు, రహదారులు, వాగులు, కల్వర్టులు, అటవీ ప్రాంతాలు తదితర ప్రమాదకర ప్రాంతాలపై అధికారులు చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆయా శాఖలు చేపట్టాల్సిన చర్యలు, పరస్పర సమన్వయంతో పనిచేసే విధానంపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.ఎక్కడైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్పందించి ప్రజలకు అవసరమైన సహాయం అందించేలా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని నిర్ణయించారు. విపత్తు నిర్వహణలో శాఖల మధ్య సమన్వయం కీలకమని, ఎలాంటి ఘటననైనా తక్షణమే ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నారని అధికారులు తెలిపారు.భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకుండా జాగ్రత్త వహించాలని అధికారులు సూచించారు. పొంగిపొర్లుతున్న వాగులు, కల్వర్టులు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలు, చెట్లు మరియు విద్యుత్ స్తంభాల సమీపంలోకి వెళ్లరాదని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.వర్షాల సమయంలో రోడ్లపై నీటి ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించవద్దని, ఏదైనా ప్రమాదకర పరిస్థితి లేదా అత్యవసర ఘటన కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మెప్మా రిసోర్స్ పర్సన్స్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే విజయచంద్ర హామీ

**పార్వతీపురం మన్యం, పెన్ పవర్ ప్రతినిధి, సెప్టెంబర్ 23:** పట్టణంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్స్ సమ=స్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హామీ ఇచ్చారు.పట్టణంలో పనిచేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్స్ బుధవారం ఎమ్మెల్యే విజయచంద్రను కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. గత 19 సంవత్సరాలుగా పట్టణ ప్రజలకు సేవలందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలకంగా పనిచేస్తున్నామని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.2017లో ప్రకటించిన గౌరవ వేతనం ప్రస్తుతం రూ.8,000గా మాత్రమే అందుతోందని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల విద్యా ఖర్చులు, విధుల్లో భాగంగా కార్యాలయాలు, బ్యాంకులు, సమావేశాలకు వెళ్లేందుకు అయ్యే ప్రయాణ ఖర్చులతో ప్రస్తుత గౌరవ వేతనం సరిపోవడం లేదని వివరించారు.ఈ నేపథ్యంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్ గౌరవ వేతనాన్ని రూ.26,000కు పెంచేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.వారి సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మెప్మా రిసోర్స్ పర్సన్స్ అందిస్తున్న సేవలను అభినందించారు. వారి సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ప్రజలకు సేవలందిస్తున్న ప్రతి వర్గానికి అండగా ఉంటూ, వారి సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు.మెప్మా రిసోర్స్ పర్సన్స్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే విజయచంద్ర హామీ



పార్వతీపురం: పట్టణంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్స్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హామీ ఇచ్చారు.పట్టణంలో పనిచేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్స్ బుధవారం ఎమ్మెల్యే విజయచంద్రను కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. గత 19 సంవత్సరాలుగా పట్టణ ప్రజలకు సేవలందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలకంగా పనిచేస్తున్నామని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.2017లో ప్రకటించిన గౌరవ వేతనం ప్రస్తుతం రూ.8,000గా మాత్రమే అందుతోందని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల విద్యా ఖర్చులు, విధుల్లో భాగంగా కార్యాలయాలు, బ్యాంకులు, సమావేశాలకు వెళ్లేందుకు అయ్యే ప్రయాణ ఖర్చులతో ప్రస్తుత గౌరవ వేతనం సరిపోవడం లేదని వివరించారు.ఈ నేపథ్యంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్ గౌరవ వేతనాన్ని రూ.26,000కు పెంచేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.వారి సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మెప్మా రిసోర్స్ పర్సన్స్ అందిస్తున్న సేవలను అభినందించారు. వారి సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ప్రజలకు సేవలందిస్తున్న ప్రతి వర్గానికి అండగా ఉంటూ, వారి సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు.

## తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దు: అరకు సీఐ ఏ. కోటేశ్వరరావు.



**అరకులోయ పెన్ పవర్ సెప్టెంబర్ 23:** వాతావరణ శాఖ జారీ చేసిన తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అరకు వేలి, డుంబ్రిగూడ, అనంతగిరి మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అరకు సీఐ ఏ. కోటేశ్వరరావు సూచించారు.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆయా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు రావద్దని, వీలైనంత వరకు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కోరారు.ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు వాగులు, వంకలు, చెరువుల వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు. తాగునీరు, ఆహారం, అత్యవసర మందులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.భారీ వర్షాల నేపథ్యంలో వాహనదారులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని సీఐ సూచించారు. ప్రజల భద్రత కోసం ప్రతి ఒక్కరూ అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

## పాత విధానంలోనే పెన్షన్లు పంపిణీ చేయాలి

కొత్త విధానం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు.

ముంచంగిపుట్టు మండల వైసీపీ అధ్యక్షుడు పాంగి పద్మారావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 23.** సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ పాత విధానంలోనే కొనసాగించాలని ముంచంగిపుట్టు మండల వైసిపి అధ్యక్షుడు పాంగి పద్మారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్ల ( ఎన్టీఆర్ భరోసా) పంపిణీ విధానంలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సరికొత్త మార్పులు చేసిందని, ఈ కొత్త విధానం ప్రకారం పింఛన్ మొత్తాన్ని రెండు భాగాలుగా విభజించారన్నారు. కేంద్ర ప్రభుత్వ వాటాను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, రాష్ట్ర ప్రభుత్వ వాటాను మాత్రమే లబ్ధిదారుల ఇంటి వద్ద నగదు రూపంలో అందజేస్తారని, ఈ మార్పుల వల్ల వృద్ధులు, వికలాంగులు బ్యాంకులకు వెళ్లాల్సి వస్తుందని, వారు తీవ్ర ఇబ్బందులు పడతారని, ఇదీ అవ్వ తాతలకు ఇబ్బంది పెట్టె కార్యక్రమామని ప్రభుత్వంపై మండిపడ్డారు. పాత విధానంలోనే పింఛన్ మొత్తాన్ని పూర్తిగా ఇంటి వద్దే పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే పింఛన్ డబ్బులు మొత్తం ఒకేసారి లబ్ధిదారుడి చేతికే ఇవ్వాలని, బ్యాంకుల తిప్పలు తప్పించాలన్నారు. కొద్దిపాటి కేంద్ర వాటా కోసం వృద్ధులు, వికలాంగులను బ్యాంకుల చుట్టూ తిప్పడం సరికాదని, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సౌకర్యాలు లేని వారు దీనివల్ల నష్టపోతారని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని పద్మారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఏడాదికే వర్షాలకు తేలిపోయిన అరగడపల్లి గ్రావెల్ రోడ్డు!





- పైకి లేచిన చిప్స్.. గుంతలమయంగా మారిన రహదారి
- తారు రోడ్డు నిర్మించాలని గ్రామస్థుల డిమాండ్

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** ఏడాది కూడా పూర్తికాకముందే అరగడపల్లి గ్రావెల్ రోడ్డు వర్షాలకు దెబ్బతిని అధ్వానంగా మారింది. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని అరగడపల్లి గ్రామానికి ఏడాది కిందట నిర్మించిన గ్రావెల్ రహదారి ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల దెబ్బతింది. రహదారిపై వేసిన చిప్స్, రాళ్లు పైకి తేలిపోవడంతో పాటు గుంతలు ఏర్పడి రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి.ఏడాది కిందటే నిర్మించిన గ్రావెల్ రహదారి ఇంత త్వరగా దెబ్బతినడంపై స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు, తగిన పర్యవేక్షణపై అధికారులు దృష్టి సారించాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రజాధనంతో నిర్మించిన రహదారి తక్కువ కాలంలోనే దెబ్బతినడం వల్ల నిధులు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామానికి తారు రోడ్డు కావాలి:**

అరగడపల్లి గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నప్పటికీ ప్రస్తుతం గ్రావెల్ రహదారినే నిర్మించారని తెలిపారు. భారీ వర్షాలకు గ్రావెల్ రోడ్డు దెబ్బతినడంతో ప్రస్తుతం రాకపోకలు మరింత కష్టంగా మారాయని చెప్పారు. రహదారిపై రాళ్లు పైకి తేలిపోవడం, గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల కోసం వెళ్లాల్సిన గిరిజనులకు రహదారి పరిస్థితి తీవ్ర సమస్యగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి:**

గ్రావెల్ రహదారి తరచూ దెబ్బతిని మరమ్మతులకు నిధులు ఖర్చు చేయడం కంటే, అరగడపల్లి గ్రామానికి శాశ్వత పరిష్కారంగా తారు రహదారిని మంజూరు చేసి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో రహదారి పరిస్థితిని పరిశీలించి, ప్రస్తుత రహదారిని తాత్కాలికంగా పునరుద్ధరించడంతో పాటు గ్రామానికి తారు రోడ్డు మంజూరుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజాధనం వృథా కాకుండా శాశ్వత రహదారి నిర్మాణానికి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

# తెదేపాకు ఎదురుదెబ్బ.

జనసేనలోకి రెండు దశాబాల టిడిపి సీనియర్ కార్యకర్తలు.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 23.** చింతపల్లి మండల రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రెండు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్ సానుభూతిపరులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. స్థానిక నేతల తీరుతో విసిగిపోయిన వారు.. తమ అనుచరులతో కలిసి స్వచ్ఛందంగా జనసేన పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు వెల్లడించారు. మండలంలోని బలపం పంచాయతీ రాళ్ళగెడ్డ కొత్తూరు గ్రామానికి చెందిన వంతల గంగరాజు, కిల్లో సత్తిబాబు 2004 నుంచి తెదేపాకు సానుభూతిపరులుగా కొనసాగుతున్నారు. పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలబడ్డారు. అయితే, కొన్నేళ్లుగా స్థానిక తెదేపా నాయకులు, కొందరు కార్యకర్తలు తమను ఉద్దేశపూర్వకంగానే పక్కన పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి గానీ, కనీసం పార్టీ కార్యక్రమాల గురించి గానీ తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. "కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఓట్ల కోసం మా వద్దకు వస్తున్నారు. పనులు పూర్తయ్యాక, మిగిలిన సమయాల్లో మమ్మల్ని కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడు" అని స్థానిక నాయకత్వ తీరుపై గంగరాజు, సత్తిబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాయకుల పక్షపాత వైఖరి, అవమానాలను ఇక భరించలేకనే నేటి నుంచి తెదేపాకు శాశ్వతంగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. జనసేనాని పవన్ కల్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు తమను ఎంతగానో ఆకర్షించాయని వారు తెలిపారు. ఆ పార్టీ విధివిధానాలు నచ్చడంతోనే తమ అనుచరులతో కలిసి స్వచ్ఛందంగా జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఏళ్ల తరబడి తెదేపాతో ప్రయాణించిన వీరు అకస్మాత్తుగా జనసేన గూటికి చేరనుండడం బలపం పంచాయతీ పరిధిలో చర్చనీయాంశంగా మారింది.

# భారీ వర్షాల్లో టూవీలర్ వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని గూడెంకొత్తవీధి ఎస్సై కె. సురేష్ సూచించారు.వర్షాల సమయంలో రోడ్లు జారుడుగా మారే అవకాశం ఉన్నందున వాహనాలను నెమ్మదిగా నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో వేగంగా ప్రయాణించరాదని తెలిపారు. జారుడు రోడ్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే వాహనాల లైట్లు, బ్రేకులు సక్రమంగా పనిచేస్తున్నాయో ముందుగానే పరిశీలించుకోవాలని ఎస్సై సూచించారు. వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప అనవసర ప్రయాణాలను తగ్గించుకుని, రహదారి పరిస్థితులను గమనిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు."మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది.. జాగ్రత్తగా ప్రయాణించి సురక్షితంగా ఇంటికి చేరుకోండి" అని ఎస్సై కె. సురేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సామూహిక వందేమాతరం గాన కార్యక్రమం

**హుకుంపేట పెన్ పవర్ సెప్టెంబర్ 23 :** అల్లూరి సీతారామ జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో విజ్ఞాన భారతి పాఠశాల లో సామూహిక వందేమాతరం పండిత్ దయల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హుకుంపేట మండలంలో 25 9 2026 సామూహిక వందేమాతరం గానం నిర్వహించబడుతుంది కార్యక్రమ కేంద్రాలు హుకుంపేట ప్రాంతంలోని విద్యార్థులు యువకులు రాజకీయ నాయకులు విద్యావంతులు దేశభక్తులు మరియు ప్రజలందరూ సామూహిక వందేమాతరం గానం నీ ఆలపించాలని కోరుకున్నారు ఇందులో భాగంగా విద్యార్థులు తల్లితండ్రులు ప్రజలు అందరూ కూడా హాజరవల్సిందిగా ప్రిన్సిపల్ అప్పలకొండ కోరుకుంటున్నారు



# భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి.

తాజా మాజీ సర్పంచ్ దురియా పుష్పలత.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 23.** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని తాజా మాజీ సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రవాయుగుండంగా మారిందని దీంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని అన్నారు. గిరిజన ప్రాంతంలో కొండ చర్యలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పూరి గుడిసెలు, మట్టి మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. అనారోగ్యాలతో బాధపడుతున్న వారు అత్యవసరమైన మందులను ముందుగానే సమకూర్చుకొని ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా చెట్ల క్రింద, కరెంటు వైర్లు, స్తంభాల కింద ఉండవద్దన్నారు. అత్యవసరమైతే తప్ప గృహాల నుండి బయటకు రాకూడదని ఆమె కోరారు.

# ముందస్తు నేర నివారణలో భాగంగా స్టీల్ ప్లాంట్ పోలీసుల విస్తృత వాహన తనిఖీలు



-విశాఖపట్నం సిటీ పోలీస్ -- సౌత్ క్రైమ్ బ్రాంచ్

**గాజువాక: పెన్ పవర్, సెప్టెంబర్ 23**

విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిపి,డిసిపి,ఎడిసిపి,ఎసిపి క్రైమ్ బ్రాంచ్ అధికారుల ఆదేశాల మేరకు, ముందస్తు నేర నివారణ చర్యల్లో భాగంగా స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ జి.డి. బాబు , స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వివిధ ప్రాంతాల్లో డైనమిక్ వెహికల్ తనిఖీలు నిర్వహించారు.

సరైన రికార్డులు లేని వాహనాలను పరిశీలించడం,

నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని వాహనాలను గుర్తించడం,

వాహనాల రిజిస్ట్రేషన్, అర్ సి తదితర పత్రాలను పరిశీలించారు. అనుమానాస్పద వాహనాలు మరియు వ్యక్తుల వివరాలను తనిఖీ నిర్వహించారు. బైక్ దొంగతనాలు, వాహన దొంగతనాలు మరియు ఇతర నేరాలను ముందస్తుగా అరికట్టే చర్యలు చేపట్టారు.

వాహన యజమానులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన అసలు చెల్లుబాటు అయ్యే పత్రాలను వెంట ఉంచుకోవాలని, వాహనాలకు నంబర్ ప్లేట్లను నిబంధనల ప్రకారం స్పష్టంగా ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. పోలీసులు వాహన తనిఖీల సమయంలో పత్రాలు అడిగినప్పుడు సహకరించి, అవసరమైన పత్రాలను చూపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేరాల నివారణలో ప్రజల సహకారం అత్యంత కీలకం. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలపై సమాచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేసి, సురక్షితమైన సమాజ నిర్మాణంలో పోలీసులకు సహకరించాలని సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ జి.డి. బాబు , స్టీల్ ప్లాంట్ ఎస్ఐ ప్రజలను కోరారు.

# మండల ప్రగతికి మీ కృషి అభినందనీయం.

పదవీ విరమణ చేసిన ప్రజాప్రతినిధులకు మాజీ సర్పంచ్ పుష్పలత శుభాకాంక్షలు.




**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 23.** చింతపల్లి మండల సమగ్ర అభివృద్ధికి గత ఐదేళ్లుగా అహర్నిశలు శ్రమించి, బుధవారంతో తమ పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధుల సేవలు చిరస్మరణీయమని చింతపల్లి మేజర్ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ దురియా పుష్పలత కొనియాడారు. బాధ్యతల నుంచి తప్పుకుంటున్న మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), జెడ్పీటీసీ సహా వివిధ పంచాయతీల ఎంపీటీసీలకు పేరుపేరునా ఆమె హృదయపూర్వక వీడ్కోలు, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లెల్లో మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరువ చేయడంలో స్థానిక సంస్థల ప్రతినిధులుగా వారు ప్రదర్శించిన అంకితభావం గొప్పదన్నారు. అందరూ సమన్వయంతో, ఒక బృందంగా కలసికట్టుగా పనిచేయడం వల్లే మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సాకారమయ్యాయని ఆమె గుర్తుచేశారు. అధికారికంగా పదవీకాలం ముగిసినప్పటికీ, భవిష్యత్తులోనూ అదే స్ఫూర్తితో ప్రజలతో మమేకమై వారి పక్షాన నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో వారు మరింత ఉన్నత రాజకీయ శిఖరాలను అధిరోహించాలని, వారి భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని పుష్పలత మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# టీ డి పి లో చేరిన వైసిపి యువ నాయకుడు

- చంద్రబాబు పర్యటన తర్వాత అరకు రాజకీయాల్లో కొత్త పరిణామాలు.
- టీడీపీలో చేరిన వైసీపీ సేవాదళ్ మాజీ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు.



**హుకుంపేటసెప్టెంబర్ 23 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం.తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకు పర్యటన అనంతరం నియోజకవర్గ రాజకీయాల్లో పలు పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా మాజీ కార్యనిర్వాహక సభ్యుడు గా పని చేసిన శెట్టి జయరాం కుమార్ తెలుగుదేశం పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.బుధవారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ బోర్డు చైర్మన్ సియ్యారి దొన్నుదొర పార్టీ కండువా కప్పి శెట్టి జయరాం కుమార్‌ను టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా జయరాం కుమార్ మాట్లాడుతూ. చంద్రబాబు నాయుడు పాలన విధానాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఆకర్షితుడై టీడీపీలో చేరినట్లు తెలిపారు. ముఖ్యంగా అరకు కాఫీ రైతులకు ప్రోత్సాహం, గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల మెరుగుదల, రహదారి సౌకర్యం లేని మారుమూల పల్లెలకు అనుసంధాన రహదారుల కల్పన వంటి అంశాలు తనను టీడీపీ వైపు ఆకర్షించాయని పేర్కొన్నారు. చంద్రబాబు పర్యటనతో అరకు ప్రాంత అభివృద్ధి అంశాలు మరోసారి ప్రధాన చర్చగా మారిన నేపథ్యంలో, తాజాగా జరిగిన ఈ చేరిక నియోజకవర్గ రాజకీయాల్లో ఆసక్తిని పెంచింది. టీడీపీ నాయకత్వం కూడా గిరిజన ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యక్రమాలను కొనసాగిస్తోంది.ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల టీడీపీ అధ్యక్షులు శతకం బొంజిబాబు, ప్రధాన కార్యదర్శి బొడ్డా శ్యామ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "వరద ఉగ్రరూపం.. జర్రెల కొత్తూరుకు దారే లేదు!"

- జర్రెల కొత్తూరు రహదారి పూర్తిగా ధ్వంసం
- స్తంభించిన రాకపోకలు.. ఆందోళనలో గ్రామస్థులు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** గూడెంకొత్తవీధి మండలంలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరద ఉధృతికి పలు ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించగా.. బుధవారం మధ్యాహ్నం జరెల కొత్తూరు ప్రధాన రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. భారీ వరద నీరు ఒక్కసారిగా రహదారిపైకి చేరడంతో జరెల కొత్తూరు వెళ్లే ప్రధాన మార్గం పూర్తిగా ముంపునకు గురైంది. వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో రహదారి తెగిపోయి రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రహదారి కొట్టుకుపోయిన సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది వెంటనే స్పందించి సంబంధిత ప్రాంతంలో పర్యటించారు. వరద పరిస్థితిని పరిశీలించి గ్రామస్థులను అప్రమత్తం చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, తెగిపోయిన రహదారుల వద్దకు వెళ్లకుండా ప్రజలకు సూచనలు చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.రహదారి తెగిపోవడంతో జర్రెల కొత్తూరు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యావసర సరుకులు, అత్యవసర వైద్య సేవల కోసం బయట ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు మరింత కొనసాగితే పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.రహదారి పునరుద్ధరణకు సంబంధించి ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. వర్షాలు తగ్గే వరకు ప్రత్యామ్నాయ లేదా తాత్కాలిక రాకపోకల మార్గాన్ని ఏర్పాటు చేసి, అత్యవసర సమయంలో వైద్య సేవలు, నిత్యావసర సరుకులు గ్రామానికి చేరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కోరుతున్నారు.

# వరి రైతులు ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి....

- పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. సుగుణ.....



**నాతవరం,పెన్ పవర్ (సెప్టెంబర్ 23):** నాతవరం మండలంలోని గునుపూడి రైతు సేవా కేంద్ర పరిధిలోని ఎస్బీ పట్నం గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ పథకాల కోసం అవసరమైన నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి. సుగుణ మాట్లాడుతూ.. వరి పంట సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేసుకోవడంతో పాటు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. పంట నమోదు ద్వారా రైతులకు ప్రభుత్వ పరంగా అందే వివిధ ప్రయోజనాలు, పంట బీమా తదితర పథకాలలో ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.వరి పంటలో సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. పంట ప్రస్తుత దశలో ఆశించే వివిధ పురుగులు, తెగుళ్లను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టే విధానాలపై అవగాహన కల్పించారు. అవసరానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని సూచించారు.అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పొలాన్ని వ్యవసాయ అధికారులు, రైతులు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో పాటిస్తున్న పద్ధతులు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు

# స్థానిక ఎన్నికలు నేపథ్యంలో 33 పంచాయతీల్లో త్వరలో ప్రచారం..!

- తుఫాన్ ప్రభావంతో అత్యవసర పరిస్థితిలో తప్ప ప్రజలు బయటకు రావద్దు..
- జనసేన పార్టీ అరకు, పాడేరు ఇన్చార్జ్, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ "వంపూరు గంగులయ్య"



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 23 :**రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా విస్తృతంగా త్వరలో ప్రసారం నిర్వహిస్తామని జనసేన పార్టీ అరకు పాడేరు ఇంచార్జ్ మరియు జానపద కళలు సృజనాత్మకత కలలు అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక ఎన్నికలపై అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంపూరు గంగులయ్య మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను నేపథ్యంలో ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని కోరారు. . మండలంలో జనసేన పార్టీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు బలంగా ఉందని తుఫాన్ తగ్గిన అనంతరం 33 పంచాయతీలో ప్రచారం ముమ్మరం గా నిర్వహిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడమే కాకుండా విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొన్ని రాజకీయ పార్టీలు చేసే అపోహాలు, అనర్థాలను జనసేన పార్టీ అభిమానులు కార్యకర్తలు నమ్మవద్దని అన్నారు. గిరిజన ప్రాంత ప్రజలకు నిరంతరం అండగా ఉండడమే జనసేన పార్టీ సిద్ధాంతమని అందుకే ఏజెన్సీ ప్రాంతాల్లో డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, స్థానిక సంస్థల నియోజకవర్గం కోఆర్డినేటర్ సెగ్గే భావన జయంతి, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు సాగిన బుజ్జి బాబు, ప్రధాన కార్యదర్శి గూడెపు శేషబాబు, కార్యవర్గ ప్రతినిధి పీటా సుదీర్ బాబు ఉపాధ్యక్షుడు కొట్టిన రాంప్రసాద్, కూడా దేవుడు జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## ఘనంగా వినాయక చవితి మహోత్సవాల నిమజ్జన కార్యక్రమం



**కూర్మన్నపాలెం:పెన్ పవర్, సెప్టెంబర్ 23**
4పిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కి కార్యకర్తలు కి ఘనంగా సన్మానం.జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి ఎన్టీఆర్ పార్క్ కమ్యూనిటీ హాల్ వద్ద వినాయక చవితి నిమజ్జనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం కి ముఖ్య అతిధిగా మాజీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ రావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం 4 పిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో టీడీపీ సీనియర్ నాయకులు బెల్లంకొండ రాజన్ రాజు, డీవీ అప్పారావు, సూరిశెట్టి పెంటరావు, చొప్ప నూకరాజు, కాండ్రేగుల భాగ్యలక్ష్మి,బొడ్డేటి దేముడు,సారిపల్లి కిరణ్, కోరుకొండ చక్రవర్తి మరియు బీజేపీ నాయకులు బోండా ఎల్లజీ ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వినాయక నవరాత్రులు ల్లో భాగంగా దుర్గ గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటిల్లో గెలిపొందిన మహిళలు కి, పిల్లలు కి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్బంగా 4పిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కార్యకర్తలే దేవుళ్ళు అని నాయకులే పార్టీ కి రథసారథులు అని అన్నారు. ఈ కార్యక్రమం లో పాల్గున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో శ్రావణ్, కర్రి వాసు, మోహన్, వంశీ, మురళి, శేఖర్, పెద్ద రాజు, అఖిల్, భాను,సేనాపతి కనకరాజు, అప్పారావు, దుర్గ గణేష్ మహిళా కమిటీ సభ్యులు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# రామణాపల్లి ఎంపీటీసీసెగ్మెంట్ ను అభివృద్ధి పథంలో నడిపించా..!

- తన ఐదేళ్ల ఎంపీటీసీ పదవి సంతృప్తి ఇచ్చింది.
- రామనాపల్లి ఎంపీటీసీ "ఇరవాడ సత్యవేణి"



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 23:** కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ ప్రజా సమస్యలు పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తారని, దీనిలో భాగంగానే తన ఐదేళ్ల ఎంపీటీసీ పాలనలో సెగ్మెంట్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని రామణాపల్లి ఎంపీటీసీ ఇరవాడ సత్యవేణి పేర్కొన్నారు. గతంలో భారత కమ్యూనిస్టు పార్టీ కొయ్యూరు మండలాన్ని 30 ఏళ్ల పాటు పరిపాలించినప్పటికీ గత ఎన్నికల్లో ఒకే ఒక్క ఎంపీటీసీ స్థానం గెలిచామన్నారు. అయితే ఆ ఒక్క స్థానముతోనే తన సిగ్నెట్లో ప్రధాన సమస్యగా ఉన్న త్రాగునీటిపై అధిక ప్రాధాన్యత ఇచ్చి ఆరు లక్షల రూపాయలతో మంచినీటి బోర్లను రామనాపల్లి పంచాయతీలో రెండు, నల్గొండ పంచాయతీలో రెండు బంగారంపేట పంచాయతీలో ఒకటి, అంతా ఆడ పంచాయతీలో ఒక మంచి నీటి బోరుతో పాటు మూడు లక్షల వ్యయంతో సిసి రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అంతడా పంచాయితీ గరుడ పి వి టి జి గ్రామానికి పూర్వపు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సహకారంతో మట్టి రోడ్డు నిర్మాణం, చేపట్టడం జరిగిందన్నారు. నల్గొండ పంచాయతీలో బోయూఊట గ్రామానికి విద్యుత్ సౌకర్యం కూడా కల్పించడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా తమ సెగ్మెంట్లలో ఎవరికి ఏ ఆపద ఎదురైనా తామున్నామంటూ ముందుకెళ్లి వారి సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో మండల అధికారులు దృష్టికి తీసుకువెళ్లి కృషి చేయడం జరిగిందన్నారు. కమ్యూనిస్టులుగా నిరంతరం ప్రజల సమస్యలకు పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే తామంతా పదవులు ఉన్న లేకున్నా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. తాను ఇంత అభివృద్ధి పనులు చేసేందుకు నిరంతరం తన భర్త మాజీ సర్పంచ్, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇరవాడ దేముడు నిరంతరం తనను ప్రోత్సహించే వారిని ఈ సందర్భంగా ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ల ఎంపీటీసీ పాలన కల్పించిన రామనాపల్లి సెగ్మెంట్ పరిధిలో ఉన్న అన్ని పంచాయతీల ప్రజలందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

# పదవులు తాత్కాలికం! ప్రజాసేవ శాశ్వతం...!

- ఎంతటి సమస్య వచ్చినా ముందుంటా...
- వైఎస్సార్సీపీ కుటుంబానికి అండగా ఉంటా...!
- మాజీ వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 23:**రాజకీయ పదవులు తాత్కాలికం,ప్రజా సేవ శాశ్వతంగా నిలుస్తాయని, రాజకీయాలకు అతీతంగా,వర్గ విభేదాలు లేకుండా ఆడాకుల ఆర్ కొత్తూరు పంచాయతీల సెగ్మెంట్ పరిధిలోని ప్రజలందరి సంక్షేమం కోసం పని చేయడం తనకుఎనలేని సంతృప్తినిచ్చింది అని మాజీ వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ పేర్కొన్నారు. ఎంపీటీసీల పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్ల కాలంలో ఆడాకుల, ఆర్ కొత్తూరు పంచాయతీల పరిధిలో తనను ఎంపీటీసీగా ఆదరించి,అడుగడుగునా మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**వైఎస్సార్సీపీ కుటుంబానికి ప్రత్యేక భరోసా:**
తనకు రాజకీయ జీవితం ఇచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, వైయస్సార్ పార్టీకుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. నేటితో పదవీ కాలం ముగిసినప్పటికీ ఆడాకుల, ఆర్ కొత్తూరు ప్రజలకు కొయ్యూరు మండలంలో ఎక్కడైనా, ఎవరికైనా ఎంతటి సమస్య వచ్చినా సరే నేను ఎల్లప్పుడూ మీకంటే ఒక అడుగు ముందే ఉంటానని నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ మనస్ఫూర్తిగా భరోసా ఇస్తున్నానని తెలిపారు కష్టసుఖాల్లో భాగస్వామినై, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తాను" అని అప్పన వెంకటరమణ స్పష్టం చేశారు
రాజకీయాలకతీతంగా సహకారం.ఈ ఐదేళ్ల ప్రయాణంలో నాకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలు, వర్గాలు ఏవైనా... గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం అన్నప్పుడు అందరం ఒకే తాటిపై నిలబడి పని చేశాంఅని అన్నారు.ఈ స్నేహపూర్వక వాతావరణం భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నాను" అని ఆయన అన్నారు.రాజకీయ పదవి ఉన్నా, లేకపోయినా ఒక సామాన్య కార్యకర్తగా,మీ ఇంటి బిడ్డగా ఎల్లప్పుడూ ఆడాకుల ఆర్ కొత్తూరు సెగ్మెంట్ ప్రజలకు అందుబాటులో ఉంటానని, మన ప్రాంత సంక్షేమం కోసం నా వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# వర్షాల బీభత్సం.. మొండిగడ్డలో కూలిన ఇల్లు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**గూడెంకొత్తవీధి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. బుధవారం సాయంత్రం మొండిగడ్డ పంచాయతీ పరిధిలోని గాలిమాను వీధిలో గబులంగి రామచంద్రరావు నివాసం ఉంటున్న పెంకుటిల్లు కూలిపోయింది.ఇంటి పైకప్పు, గోడలు కూలిపోవడంతో ఆస్తి నష్టం సంభవించింది. అయితే ఘటన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.భారీ వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే ఇంటిని పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించాలని గబులంగి రామచంద్రరావు కోరారు.

# భారీ వర్షాలపై యంత్రాంగం అప్రమత్తం



- 50 పునరావాస కేంద్రాలు సిద్ధం
- 24/7 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు
- కొండవాలు ప్రాంతాల్లో కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పర్యటన

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుం డం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేప థ్యంలో విశాఖ జిల్లాలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటన లు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేప ట్టినట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపా రు.బుధవారం ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్డీవోలు, ఇతర అధికారులతో కలిసి కలె క్టర్ మాధవధార వాంబే కాలనీ, కస్తూరినగర్ తదితర కొండవాలు, వాయుగుండం ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో కొండచరియలు జారిన ప్రదేశాలను పరిశీలిం చారు.వాంబే కాలనీలో ఇటీవల శ్లాబ్ పెచ్చులు పడి గాయపడిన మహిళను కలెక్టర్, ఎమ్మెల్యే, జీవీఎంసీ కమిషనర్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ.. వాయుగుండం ప్రస్తు తం విశాఖపట్నానికి సుమారు 190 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు. వాయుగుండం భూభాగాన్ని తాకే సమయం ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున గురువారం సాయంత్రం వరకు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉంద న్నారు. లోతట్టు, కొండవాలు ప్రాంతాలపై నిరం తరం నిఘా ఉంచామని, అవసరమైన చోట్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నా మని చెప్పారు.ఇప్పటివరకు విశాఖలో ఐదు కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలిం చినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 50 పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచామని, అవసరమైతే ప్రజలను తరలించేందుకు సంబం ధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకు న్నామని వెల్లడించారు.రోడ్లపై చెట్లు పడటం, డ్రైనేజీలు బ్లాక్ కావడం వంటి సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించేలా నగరం, జిల్లాలో ఫీల్డ్ స్థాయి బృందాలను అందుబాటులో ఉంచి నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో అన్ని శాఖల సమన్వయంతో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. విశాఖ నగరంలో సిటీ ఆపరేషన్ సెంటర్, కమాండ్ కంట్రోల్ సెంట ర్ ద్వారా పరిస్థితిని రియల్‌టైమ్‌లో పర్యవేక్షి స్తున్నామని తెలిపారు.జోనల్ స్థాయిలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివ రకు సుమారు 20 ఫిర్యాదులు అందగా, వాటిని వెంటనే పరిష్కరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. గురువారం సాయంత్రం వరకు భారీ వర్షాల సూ చనలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండా లని, అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవే క్షిస్తున్నారని తెలిపారు.కలెక్టర్ వెంట భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్‌తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

## ప్రమాదకరంగా మారిన సంగంవలస రోడ్డు

- భయాందోళనలో వాహనదారులు, ప్రజలు.
- రోడ్డు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలన్న గ్రామస్తులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 23.**మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ, సంగంవలస గ్రామానికి వెళ్ళే తారు రోడ్డు భారీ వర్షానికి కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. రోడ్డు నిర్మాణం చేపట్టి ఐదు నెలలు గడవక ముందే భారీ వర్షాల కారణంగా వరద ఉధృతికి రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడ్డాయని, తారు రోడ్డు సరిహద్దు గోడ వర్షానికి కొట్టుకుపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. సుత్తిగూడ నుండి సంగంవలసకు సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి సదరు కాంట్రాక్టర్ మే నెలలో పనులు పూర్తి చేశారు. అయితే ఐదు నెలలు గడవ ముందే వర్షాలకు మంగళవారం రాత్రి రోడ్డు ప్రక్కను ఉన్న కాలువ కారణంగా వరద ఉధృతికి రోడ్డు కోతకు గురైందన్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు భయాందోళన నడుమ రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. పొలాల మధ్య ఉన్న ఈ రహదారి కోతకు గురికాకుండా రెండు వైపులా రక్షణ గోడ నిర్మించాలని అన్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లోపం సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని, తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డును మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

## భారీ చెట్టు కూలి.. ఐదు పంచాయతీలకు విద్యుత్ అంతరాయం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**భారీ వర్షాల నేపథ్యంలో గూడెంకొత్తవీధి మండలం లంకపాకల్లు కొండపై ప్రాంతంలో తెల్లవారుజామున భారీ చెట్టు 33 కేవీ చింతపల్లి ఫీడర్‌పై కూలిపోయింది. దీంతో సప్పర్ల అన్‌మ్యాన్డ్ సబ్‌స్టేషన్, ధారకొండ సబ్‌స్టేషన్, డుప్పులవాడ అన్‌మ్యాన్డ్ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.చెట్టు కూలడంతో 33 కేవీ విద్యుత్ లైన్‌కు భారీ నష్టం వాటిల్లింది. సుమారు 10 స్పాన్ల మేర కండక్టర్ దెబ్బతిని తెగిపోయినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. భారీ వర్షాల మధ్య సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.ఈ ఘటనతో మండలంలోని డుప్పులవాడ, ధారకొండ, అమ్మవారి ధారకొండ, గుమ్మిరేవుల, గాలికొండ పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పునరుద్ధరణ పనులు పూర్తయిన అనంతరం విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

# ఖరీఫ్ ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి


అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 23 :** ఖరీఫ్ 2026-27 సీజన్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లను పక డ్బందీగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ధాన్యం కొనుగోలు, సేకరణకు సంబంధించిన వివిధ శాఖల అధికా రులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 2,278 హెక్టార్లలో వరి సాగు చేసిన ట్లు, దాదాపు 11,600 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని జిల్లా వ్యవసా య అధికారి చంద్రారావు తెలిపారు. నవంబర్ రెండో వారం నుంచి ధాన్యం దిగుబడి ప్రారంభ మయ్యే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రా ల ఏర్పాటు, ధాన్యం సేకరణ, రవాణా తదితర ఏర్పాట్లను ఇప్పటి నుంచే పూర్తి చేయాలని జేసీ సూచించారు.రైతులతో ముందుగానే సంప్రదిం పులు జరిపి అవసరానికి అనుగుణంగా క్లస్టర్ల ను ఏర్పాటు చేయాలని, సెప్టెంబర్ నెలాఖరులో గా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించా రు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన రవాణా సదుపాయాలను సిద్ధం చేసుకోవాల న్నారు.ఈ-పంట, ఈ-కేవైసీకి సంబంధించిన పెండింగ్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం నాణ్యత, తేమ శాతాన్ని పరిశీలించేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలని, తేమ శాతం, తూనికలు, నాణ్యత ప్రమాణాలను లీగల్ మెట్రాలజీ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, కనీస మద్దతు ధర, నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని జేసీ సూచించారు. కొనుగోలు ప్రారంభానికి ముందే రైస్ మిల్లులను తనిఖీ చేయాలని, ధాన్యం సేకరణ, రవాణా, నిల్వ సమయంలో వృథా జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.అవసరమైన గన్నీ బ్యాగులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, రైస్ మిల్లర్లు అవసరమైన బ్యాంకు గ్యారంటీల ను సకాలంలో సమర్పించేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా పారదర్శకంగా, సకాలంలో ధాన్యం సేకరణ జరిగేలా అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పనిచేయాలని జేసీ విద్యాధరి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రారావు, సివిల్ సప్లైస్ డీఎం సృజన, జిల్లా సహకార అధికారి ప్రవీణ, మిల్లర్స్ అసోసియే షన్ ప్రతినిధులు, లీగల్ మెట్రాలజీ, రోడ్డు రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సమాయత్తం



**విశాఖ, పెన్ పవర్, సెప్టెంబర్ 23 :**రానున్న జీవీఎంసీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పా ర్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విశాఖ జిల్లా పార్టీ సమన్వయ సమావేశం నిర్వహించారు. తాడేప ల్లిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ స మావేశానికి మాజీ శాసనసభ్యులు మళ్ల విజయ ప్రసాద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జీవీఎం సీ ఎన్నికల్లో మేయర్‌తో పాటు వార్డు కార్పొరేట ర్ స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి క్షేత్రస్థా యి నుంచి కార్యకర్తలను సమన్వయం చేసుకో వాలని వైఎస్ జగన్ సూచించినట్లు పార్టీ వర్గా లు తెలిపాయి. ప్రజలతో నిరంతరం మమేకమ వుతూ స్థానిక సమస్యలను తెలుసుకుని పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచిం చినట్లు పేర్కొన్నారు.అలాగే ఆయా ప్రాంతాల్లోని స్థానిక రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక, రాజకీయ, సామాజిక సమీకర ణాలకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక చేప ట్టాలని సమావేశంలో చర్చించినట్లు పార్టీ వర్గా లు వెల్లడించాయి. ఈ సమావేశంలో విశాఖ జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొని రానున్న ఎన్నికలకు సంబంధించి పార్టీ వ్యూహంపై చర్చించారు.

## కొయ్యూరు మండల స్పెషల్ ఆఫీసర్ గా డి ఎల్ పి ఓ పి ఎస్ కుమార్.



**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 23:** కొయ్యూరు మండల స్పెషల్ ఆఫీసర్ (ప్రత్యేక అధికారి)గా పాడేరు జిల్లా డి ఎల్ పి ఓ అయిన పి ఎస్ కుమార్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలను జారీ చేసినట్టు కొయ్యూరు ఎంపీడీవో జీవిడి ప్రసాద్ ఇక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం సంబధిత ఆదేశాలను పాడేరు జిల్లా కలెక్టర్ జారీ చేసినట్టు తెలిపారు. ఈ నెల 23 తో మండల పరిషత్ కు ఎంపీటీసీ లు, ఎంపీపీ లకు పదవి కాలం ముగిసిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో. మండల పరిపాలన సౌలభ్యం మేరకు మరియు రానున్న స్థానిక సంస్థల (ఎంపీటీసీ లు సర్పంచ్ లు) ఎన్నికల ముందు నుంచి మండల పరిధిలో పరిపాలన అందించే క్రమంలో నడిపించుటకు ప్రత్యేక అధికార్ల పాలన కు సంబంధించిన స్పెషల్ ఆఫీసర్ ను నియమిస్తూ ఈ నెల 24 నుంచి ప్రత్యేక అధికారిగా పాడేరు డి ఎల్ పి ఓ పి . ఎస్ కుమార్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ నిశాంతి ఆదేశాలను జారీ చేసినట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఈ నెల 23 తో ఎంపీటీసీ లు, ఎంపీపీ లకు పదవి కాలం ముగిసినట్టు ఎంపీడీవో తెలిపారు.

# లైబ్రరీ అంటేనే భయపడుతున్న రీడర్స్!





- పాడైపోయిన స్లాబ్.. ఎప్పుడు పెచ్చులు ఊడిపడతాయోనని ఆందోళన......
- విద్యార్థుల భద్రతపై ఆందోళన.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్....
- గ్రంథాలయ అధికారి...

**నాతవరం,పెన్ పవర్ (సెప్టెంబర్ 23):**మండల కేంద్రమైన నాతవరంలో ఉన్న గ్రంథాలయ శాఖ దుస్థితి పాఠకులను, విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చదువుకోవడానికి వచ్చే విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయంలో అడుగుపెట్టాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. శిథిలావస్థకు చేరిన భవనం ఎప్పుడు ప్రమాదానికి గురిచేస్తుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.గ్రంథాలయ భవనం పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోందని గ్రంథాలయ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. “అధికారిణిగా విధులు నిర్వహిస్తున్న నాకే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది” అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.గ్రంథాలయ భవనం స్లాబ్ పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్లాబ్ నుంచి వర్షపు నీరు లోపలికి కారడంతో పాటు, స్లాబ్ పెచ్చులు ఊడిపడి కిందకు పడుతున్నాయని వివరించారు. దీంతో గ్రంథాలయంలో కూర్చుని చదువుకునే విద్యార్థులు, పాఠకులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారని తెలిపారు.స్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడటంతో గ్రంథాలయంలో భద్రపరిచిన విలువైన పుస్తకాలు సైతం వర్షపు నీటికి తడిసి పాడయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పుస్తకాల సంరక్షణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని పుస్తకాలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు.నాతవరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు, నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. అయితే భవనం దుస్థితి కారణంగా ప్రశాంతంగా చదువుకునే వాతావరణం లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న నేపథ్యంలో విద్యార్థులు, పాఠకుల భద్రతపై ఆందోళన నెలకొంది.విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడాల్సిన గ్రంథాలయం ప్రస్తుతం వారి భద్రతకే ప్రశ్నార్థకంగా మారడం బాధాకరమని పలువురు పేర్కొంటున్నారు.గ్రంథాలయ భవనానికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన నిధులు మంజూరు చేసి స్లాబ్‌ను పునరుద్ధరించాలని గ్రంథాలయ అధికారి కోరారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యార్థులు, పాఠకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని గ్రంథాలయాన్ని తాత్కాలికంగా సురక్షితమైన ప్రత్యామ్నాయ భవనానికి మార్చాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా అధికారులు, సంబంధిత గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి భవనాన్ని పరిశీలించి, ప్రమాదకర పరిస్థితిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, పాఠకులు కోరుతున్నారు.

## అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటే ప్రత్యేక గుర్తింపు.

జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 23.** ప్రజా సంక్షేమ, అభివృద్ధి కి ప్రాధాన్యతనిస్తూ ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించిన ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నేటితో ( గురువారం) పదవీ కాలాన్ని ముగించుకుంటున్న ఎంపీపీ కోరాడు అనూష దేవి, జెడ్పీటీసి సభ్యుడు పోతురాజు బాలయ్య మరియు ఎంపీటీసీ సభ్యులను ఎంపీడీవో లాలం సీతయ్య అధ్యక్షతను సన్మాన సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎంపీపీ జడ్పిటిసి ఎంపీటీసీ సభ్యులు ఐదేళ్ల సుదీర్ఘకాలంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు రాజకీయంలో ఎదుర్కొన్న ఒత్తిడిలు ఒడిదుడుకులను వివరిస్తూ భావోద్వేనానికి లోనయ్యారు. సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ఎంపీపీ అనూష దేవి, జెడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య ఇద్దరు ఒకరికొకరు ఐక్యత చాటుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ కనబరిచి కృషి చేశారన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కారాన్ని చూపించేందుకు చొరవ చూపేవారున్నారు. జడ్పీ నిధులను సైతం ఎంపీపీ, జెడ్ పి టి సి సభ్యుల అభ్యర్థన మేరకు అధిక మొత్తంలో మండలానికి కేటాయించామన్నారు. రానున్న రోజుల్లో ఎంపీపీ, జడ్పిటిసి సభ్యులు రాజకీయాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మహిళలు ప్రధానంగా రాజకీయాల్లో రాణించాలన్నారు. అనంతరం ఎంపీపీ కోరాబు అనుష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్యలతో పాటు 20 మంది ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జిసిసి మాజీ చైర్మన్ శోభారాణి, ఎంపీడీవో లాలం సీతయ్య, తహసిల్దార్ హనుమంతు త్రివేణి, డిప్యూటీ ఎంపీడీవోలు సిహెచ్. సీతామహాలక్ష్మి బి ఎ బి ఎల్ మూర్తి. వైస్ ఎంపీపీలు సాగిన వెంగళరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

# మాతా శిశు మరణాల నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.




### వైద్యాధికారులు, క్షేత్రస్థాయి అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలి.

### ఎంపీపీ కోరాడు అనూష దేవి.

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 23.** ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో మాత, శిశు మరణాల నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మొదటిగా సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో మాతా శిశు మరణాలు అరికట్టేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ ఏదో ఒక చోట తల్లులు, శిశువులు మరణిస్తున్నారన్నారు. ఇటీవల చింతపల్లి మండలం కొలపరి గ్రామానికి చెందిన లోవశాంతి మృత శిశువుకు జన్మనివ్వడం, అనంతరం ఆరోగ్యం క్షీణించి చికిత్స పొందుతూ మరణించిన విషయం పత్రికల్లో చూసి తీవ్రంగా చలించిపోయానన్నారు. ఒకింత వేదనకు గురైనట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, క్షేత్రస్థాయి ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తే మాతా, శిశు మరణాలు అదుపు చేయవచ్చును అన్నారు. వాతావరణం లో కలిగిన మార్పు వల్ల గిరిజన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో రహదారులు, తాగు, సాగు నీటి పథకాలు నిర్మిస్తుందని ఈ పనులకు నాణ్యత ప్రమాణా లతో సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తన ఐదేళ్ల పదవీకాలంలో ప్రజల సమస్యలు పరిష్కారం కోసం అధికారులను నొప్పించి ఉంటే మన్నించాలని కోరారు. అనంతరం జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ చింతపల్లి మండలంలో సమర్థవంతమైన అధికారులు ఉన్నారని అధికారులు అందరూ బాధ్యతాయుతంగా చిత్తశుద్ధితో పనిచేయడం వల్ల ప్రజాప్రతినిధులకు మంచి పేరు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య, తహసిల్దారు హనుమంతు త్రివేణి, వైస్ ఎంపీపీలు గోపి నాయక్ శారద, సా గిన వెంగళరావు పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లాలో 11 మండలాలకు స్పెషల్ ఆఫీసర్లు

ఎంపీపీల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో కలెక్టర్ ఉత్తర్వులు



**స్టాఫ్ పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో మండల పరిషత్ అధ్యక్షుల (ఎంపీపీ) పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో 11 మండలాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ జిల్లా కలెక్టర్ టి. నిశాంతి బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.నియమితులైన స్పెషల్ ఆఫీసర్ల వివరాలు ఇలా ఉన్నాయి:

- అనంతగిరి -- స్వామి నాయుడు
- అరకు -- శ్రీధర్
- చింతపల్లి -- వెంకటరమణరావు
- డుంబ్రిగూడ -- బి.ఎస్. నంద్
- గూడెంకొత్తవీధి -- బాబు నాయక్
- జి.మాడుగుల -- విద్యాసాగర్
- హుకుంపేట -- చంద్రశేఖర్
- కొయ్యూరు -- పి.ఎస్. కుమార్
- ముంచంగిపుట్టు -- మోహన్ బాబు
- పాడేరు -- జయకృష్ణ
- పెదబయలు -- రాధామాధవి

ఎంపీపీల పదవీకాలం ముగిసిన అనంతరం మండల పరిషత్ పరిపాలనా వ్యవహారాలను స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించనున్నారు.

# భారీ వర్షాలకు డైవర్షన్ రోడ్డుకు ముప్పు



బ్రిడ్జి నిర్మాణం వద్ద పెరుగుతున్న వరద నీరు..

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని చెమగడ్డ గ్రామం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన మట్టి డైవర్షన్ రోడ్డుకు భారీ వర్షాలతో ముప్పు పొంచి ఉందని మండల తెలుగు యువత అధ్యక్షుడు ముర్ల కోటేశ్వరరావు తెలిపారు.ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు కొండ ప్రాంతాల నుంచి వరద నీరు పెద్ద ఎత్తున వచ్చి డైవర్షన్ రోడ్డుపైకి చేరుతోందని ఆయన తెలిపారు. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే మట్టి రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోతే అమ్మవారి ధారకొండతో పాటు వంచుల పంచాయతీలోని పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని కోటేశ్వరరావు పేర్కొన్నారు.ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అప్పటివరకు డైవర్షన్ రోడ్డుకు రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## అత్యంత వైభవంగా వినాయకుని నిమజ్జనం

- నిమజ్జనంలో గిరిజన సాంస్కృతిక సాంప్రదాయం దింసా నృత్యాలు.
- భారీ డీజే సౌండ్ బ్యాండ్ పార్టీలతో దద్దరిల్లిన ముంచంచంగిపుట్టు మండల కేంద్రం.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరరు 23.**మండలంలోని జంగంసరియా బోడిపుట్టు మజ్జిగూడ మూడు గ్రామాల భక్తులు ఏర్పాటు చేసుకున్న వినాయక గణనాధుని నిమజ్జనం బుధవారం అత్యంత వైభవంగా కొనసాగింది. నవరాత్రుల పూజలు అందుకొన్న గణనాధుని నిమజ్జనం గిరిజన సాంస్కృతిక సాంప్రదాయాలకు అనుగుణంగా మూడు గ్రామాల భక్తులు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద భారీ దింసా నృత్యాలు చేస్తూ, డీజే సౌండ్, బ్యాండ్ పార్టీలతో మండల కేంద్రం దద్దరిల్లాయి. ఈ ఏడాది 12 అడుగులు విగ్రహం ఏర్పాటు చేశారు. భారీ ఎత్తున డీజే సౌండుతో ఐదు కిలోమీటర్ల ఊరేగింపు చేసి సుజనకోట పంచాయతీ కేంద్రంలో గల మత్స్యగెడ్డ లో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి గణనాధుని దర్శించుకున్నారు. లడ్డు పాట ఎప్పుడూ లేని విధంగా తాంగుల బలరాం జంగంసరియా గణనాధుని లడ్డును 51వేల రూపాయలతో దక్కించు కున్నారు. రెండ లడ్డు పాట 35వేలు రూపాయలతో కిలో గోపాల్ దక్కించుకున్నారు. వేలంపాట లడ్డును ఎంపిడిఓ ధర్మారావు, ఎస్ఐ పి నాని చేతుల మీదుగా బలరాంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బలరాం, దామోదరం, నారాయణ, శ్రవాణ్ కుమార్, గాసిరామ్, బొల్లి బాబు, సీత రామ్ అర్జున్ గోపాల్ సీతారామ్ మజ్జి చిన్న బాబు, బలరాంతో మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## తుప్పల్లోంచి దూసుకొచ్చిన పాము.. యువకుడికి కాటు

సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో తప్పిన ప్రాణాపాయం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని బూసుమానువీధికి చెందిన ముర్ల అయ్యప్ప (18) పాము కాటుకు గురయ్యాడు.రోజువారీగా పశువులను మేపేందుకు వెళ్లిన అయ్యప్ప.. పశువులను కాస్తున్న సమయంలో తుప్పల్లో ఉన్న పాము ఒక్కసారిగా కాలుపై కాటు వేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో, అతని తండ్రి దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్స్‌లో అయ్యప్పను దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి బాబ్జీ సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు.ప్రస్తుతం అయ్యప్ప ఆరోగ్యం నిలకడగా ఉందని, పూర్తిగా కోలుకున్న అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తామని వైద్యాధికారి పేర్కొన్నారు.

## తాడేపల్లిలోజగన్ మోహన్ రెడ్డి మర్యాదపూర్వక కలిసిన:13 వ వార్డు వైసిపి అధ్యక్షుడు సత్యాల వెంకట్



**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 23:**తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో విశాఖపట్నం ముఖ్యనేతల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన 13 వ వార్డు అధ్యక్షులు సత్యాల వెంకట్, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, నగర అధ్యక్షుడు కేకే రాజు లు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి.వార్డు సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు.

## దారకొండలో ఉధృతమైన వరద.. 20 గ్రామాలకు రాకపోకలు బంద్



డి.అగ్రహారం వంతెనపై నుంచి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వరద నీరు

ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల విజ్ఞప్తి

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 23**:గూడెంకొత్తవీధి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దారకొండ సమీపంలోని డి.అగ్రహారం వంతెనపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లోని సుమారు 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించే పరిస్థితి నెలకొంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో వంతెన వద్ద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. దీంతో వంతెనను దాటి వెళ్లడం ప్రమాదకరంగా మారింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లాల్సిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు వైద్య సేవల కోసం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. నిత్యావసర వస్తువులు, వైద్యం, తాగునీరు వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.వరద ఉధృతి మరింత పెరిగితే సుమారు 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే వంతెన వద్ద పరిస్థితిని పరిశీలించి, ప్రజలు ప్రమాదకరంగా వంతెన దాటకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.వరద ప్రవాహం తగ్గే వరకు వంతెన వద్ద పర్యవేక్షణ ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యామ్నాయ రాకపోకల మార్గాలను గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరుతున్నారు.

## మెట్టగూడలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రారంభం

- హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంతో మెట్టగూడ గ్రామస్తులకు నెరవేరబోతున్న వంతెన కల.
- బ్రిడ్జి నిర్మాణం నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మాణం చేపట్టాలి.
- పాడేరు ఐపి యూఈఈ ఎస్ రామక్రిష్ణ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 23.**అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండలం, లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మెట్టగూడ గ్రామంలో ప్రధానమంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం-జన్మన్) పథకంలో భాగంగా ఐదు స్పాన్ల హైలెవల్ వారధి నిర్మాణ పనులు బుధవారం వేగవంతంగా ప్రారంభమయ్యాయి. రూ.385.88 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన ఈ వంతెన నిర్మాణానికి సంబంధించి అబుట్‌మెంట్ పునాది తవ్వకం పనులను అధికారులు బుదవారం ప్రారంభించారు. లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని చుట్టు ప్రక్కల గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, వర్షాకాలంలో వాగులు ఉధృతంగా పారినప్పుడు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఆయా చుట్టుప్రక్కల గిరిజన గ్రామాలకు శాశ్వత రహదారి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. వంతెన నిర్మాణాన్ని నిర్ణీత కాలపరిమితిలోగా, ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ వంతెన పూర్తయితే మెట్టగూడ పరిసరాల గిరిజన గ్రామ ప్రజల దశాబ్దాల రవాణా సమస్య తీరనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు జె ఈ మురళి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## తాడేపల్లిలో జగన్‌తో విశాఖ తూర్పు నేతల భేటీ

12వ వార్డు అధ్యక్షులు మొల్లి హేమంత్, సమన్వయకర్త మొల్లి అప్పారావు మర్యాదపూర్వక భేటీ



**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 23:**తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో విశాఖపట్నం ముఖ్యనేతల సమావేశం జరిగింది.
ఈ సందర్భంగా విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన 12వ వార్డు అధ్యక్షులు మొల్లి హేమంత్ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావులి లు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.

## సిడిపిఓ సిహెచ్ శ్రీదేవి బదిలీ.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 23.** చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ శ్రీదేవి ఎస్.కోట కు బదిలీ అయ్యారు. జోన్ల విభజనలో భాగంగా జోన్ 2 పరిధి చింతపల్లి ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న శ్రీదేవిని జోన్ 1 ఎస్ కోట ప్రాజెక్టుకి బదిలీని,మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో పల్నాడు జిల్లా వినుకొండ ప్రాజెక్టులో సిడిపిఓ గా పనిచేస్తున్న కే.వాణిని చింతపల్లి సిడిపిఓ గా నియమించారు. నూతన సిడిపిఓ గా ఆమె రెండు రోజుల్లో విధులలో చేరనున్నారు.

## దేశభక్తిని చాటేలా.. చింతపల్లిలో 25న వందేమాతర సామూహిక గానం.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 23.**భారత జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచిన 'వందేమాతరం' గీతం ఆవిర్భవించి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో ఈ నెల 25వ తేదీ శుక్రవారం 'సంపూర్ణ సామూహిక వందేమాతర గానం' అట్టహాసంగా నిర్వహించనున్నారు. న్యూఢిల్లీలోని విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ప్రేరణతో, భారతీయ విద్యా కేంద్రం (బి.వి.కె) ఆధ్వర్యంలో నడుస్తున్న స్థానిక విజ్ఞాన భారతి పాఠశాల ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఉదయం సరిగ్గా 11 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ సామూహిక గాన కార్యక్రమం ప్రధానంగా జరగనుంది. దీనితో పాటే మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జీటీడబ్ల్యూఏ (బాలికల) పాఠశాల, అలాగే రింతడలోని జీటీడబ్ల్యూఏ (బాలికల) పాఠశాల ప్రాంగణాల్లోనూ ఏకకాలంలో ఈ దేశభక్తి గీతాన్ని ఆలపించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ?వందేమాతరం కేవలం పదాల సమాహారం కాదని, అది మాతృభూమి పట్ల భక్తి, ఆత్మగౌరవం, అంకితభావాలకు అద్దంపట్టే ఒక శాశ్వత మంత్రమని విజ్ఞాన భారతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేష్ పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలోని ప్రతి దశలోనూ అన్యాయాన్ని ఎదిరించి పోరాడేందుకు, ప్రాణత్యాగాలకు వెరవకుండా పట్టుదలతో నిలబడేందుకు ఎందరో సమరయోధులకు ఈ గీతం స్ఫూర్తినిచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఈ చారిత్రక గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న శుభతరుణంలో దేశవ్యాప్తంగా కోట్లాది గొంతుకలు ఒక్కటై వందేమాతరాన్ని సామూహికంగా ఆలపిస్తున్నాయని తెలిపారు. జాతీయ భావాన్ని ఉప్పొంగేలా చేసే ఈ మహోన్నత కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని మన దేశభక్తిని ప్రపంచ నలుమూలలా తెలిసేలా చాటిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎంపీటీసీలకు ఘన సత్కారాలు- ఎంపిటిసిల సేవలను కొనియాడిన అధికారులు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 23.**మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులకు మండల పరిషత్ అధికారులు ఘన సత్కారాలు మరియు ఘనంగా వీడ్కోలు పలికారు. 2021లో ఎన్నికైన వీరి ఐదేళ్ల పదవీ కాలం ముగుస్తుండటంతో మండల కేంద్రంలోనీ మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వీరిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. గత ఐదేళ్లుగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి ఎంపిటిసిలు చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడుతున్నారు. ఐదేళ్ల కాలంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ అధికారులు సిబ్బంది తమకు అందించిన సహాయ సహకారాలు మరువలేనిదని ఎంపిటిసిలు అన్నారు. ఐదేళ్లపాటు ప్రజా సేవలో అవకాశం కల్పించిన ప్రజలకు ఈ సందర్భంగా ఎంపిటిసిలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సత్కారాలు పొందిన వారిలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ 1 పాటుబోయి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ 2 సిరగం భాగ్యవతి, ఎంపిటిసిలు బి కమల, ఎం సుబ్బలక్ష్మి, పి గణపతి, వి విజయలక్ష్మిలతో పాటు తదితర ఎంపిటిసిలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com